

శుక్రవారం 06 నవంబర్ 2026 పేజీలు:06



2 లో

ఉట్కూర్ రైతు వేదికలో ఉపాధి మేటీలకు శిక్షణ

అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పిస్తాం

- నాగర్ కర్నూల్ జిల్లాలో 38,377 మంది పట్టభద్రుల ఓటర్ల నమోదు

- 80 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి,

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



నాగర్ కర్నూల్ నవంబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో)

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, అర్హులైన పట్టభద్రుల దరఖాస్తులను నిబంధనల ప్రకారం గడువులోగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఆమోదించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.

మిగతా 2 లో



శ్రీ అక్షర స్కూల్ లో పేరెంట్స్ -టీచర్స్ మీటింగ్

మహమ్మదాబాద్ నవంబర్ 5 (ప్రజా జ్యోతి)

దేశాయిపల్లి ఎక్స్ రోడ్ లో గల శ్రీ అక్షర గ్రామర్ స్కూల్ లో గురువారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశం లో విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, హాజరు శాతం, వ్యక్తిత్వ వికాసం, చదువులో వెనుకబడిన విద్యార్థుల అభివృద్ధి తదితర అంశాల పై ఉపాధ్యాయులు తల్లి దండ్రుల తో చర్చించారు.

మిగతా 2 లో

అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పిస్తాం

మొదటిపేజీ తరువాయి

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ పురోగతి, దరఖాస్తుల పరిశీలన, అర్హులైన ఓటర్ల నమోదు తదితర అంశాలపై గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశంలో నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి అదనపు కలెక్టర్ బి చేన్నయ్య తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ పురోగతిని, ఇప్పటివరకు నమోదైన ఓటర్ల వివరాలను, దరఖాస్తుల పరిశీలన స్థితిని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వివరించారు.నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా నాగర్ కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్..నియోజకవర్గాల పరిధిలో ఇప్పటివరకు మొత్తం 38,377 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. నమోదైన దరఖాస్తుల్లో సుమారు 80 శాతం దరఖాస్తులను పరిశీలించి ఆమోదించడం జరిగిందన్నారు. ఇంకా 1,426 మంది పట్టభద్రుల దరఖాస్తులను పరిశీలించాల్సి ఉందని, వాటిని కూడా నిర్ణీత గడువులోగా పరిశీలించి అర్హతల ఆధారంగా ఓటర్లుగా నమోదు చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతోందని వివరించారు.పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు నమోదుకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుదారులు సమర్పించిన విద్యార్హత ధ్రువపత్రాలు, ఇతర వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్నవారి దరఖాస్తులను ఆమోదిస్తున్నామని తెలిపారు.అదేవిధంగా కల్వకుర్తి..నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరు నమోదుకు సంబంధించి నకిలీ ధ్రువపత్రం సమర్పించినట్లు వచ్చిన ఫిర్యాదుపై కూడా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి దృష్టికి జిల్లా కలెక్టర్ తీసుకెళ్లారు, ఈ ఫిర్యాదును పరిశీలించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వివరించారు.నాగర్ కర్నూల్ నియోజకవర్గం పరిధిలో 12539 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడం జరిగిందని ఇంకా 310 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో 9329 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడం జరిగిందని ఇంకా 128 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో 7041 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడం జరిగిందని ఇంకా 290 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలో 9468 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడం జరిగిందని ఇంకా 698 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని అన్నిటిని నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా జిల్లాలో చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు.మొత్తంగా జిల్లాలో 1,426 దరఖాస్తులు పరిశీలనకు పెండింగ్లో ఉన్నాయని, వాటన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేసి అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించేలా చర్యలుతీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీవోలు అర్చన, బన్సీలాల్, జనార్దన్ రెడ్డి కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, ఎన్నికల డిటీ కల్పన తదితరులు అధికారులు పాల్గొన్నారు.

ఉట్కూర్ రైతు వేదికలో ఉపాధి మేటీలకు శిక్షణ

మొదటిపేజీ తరువాయి

ఉట్కూర్, నవంబర్ (ప్రజాజ్యోతి)

ఉట్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఉపాధి హామీ మేటీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల ఎంపీడీవో మేడం పావని అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామానికి ముగ్గురు చొప్పున మేటీలను సెలక్షన్ చేసి, ఒక్కొక్క మేటీ వద్ద 40 మంది కూలీలు తగ్గకుండా గ్రామంలో ఉపాధి హామీ పనులు ఎలా నిర్వహించాలి, కూలీల హాజరు, మస్టర్లు, పనుల కొలతలు, వేతనాల చెల్లింపు విధానం తదితర అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఉపాధి పనులను పకడ్బందీగా నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు.అలాగే కొత్తగా ఎంపికైన మేటీలకు పాత మేటీల అనుభవాలను పంచుకునేలా సూచనలు చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఏపీవో లక్ష్మారెడ్డి గారు, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మేటీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మేటీల సందేహాలను నివృత్తి చేశారు.

శ్రీ అక్షర స్కూల్ లో పేరెంట్స్ -టీచర్స్ మీటింగ్

మొదటిపేజీ తరువాయి



ప్రతి విద్యార్థి చదువు తో పాటు ఆట పాటల్లో,వ్యక్తిత్వ వికాసం లో ముందుండేలా, యాజమాన్యం మరియు బోధనా సిబ్బంది కృషి చేస్తుందని తెలిపారు.ఈ సమావేశానికి హాజరయ్యి పలు సూచనలు సలహాలు అందించి న తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది.అక్షర స్కూల్ లో చదవడం వల్ల తమ పిల్లలు చదువు తో ఆట పాటల్లో ముందున్నారని చెప్పుకొచ్చారు. చదువు తో పాటు సంస్కారాన్ని అందిస్తున్న పాఠశాల సిబ్బంది ని ప్రశంశించారు. ఈ స్కూల్ వలే మండలం లోని అన్ని పాఠశాల లు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని అభిప్రాయ పడ్డారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రహ్లాద్ రెడ్డి తో పాటు బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది,పేరెంట్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపిన ప్రముఖ సైకాలజిస్ట్ రాధాకృష్ణారావు నిపుణుల ప్రసంగం

కృష్ణా నవంబర్ 05(ప్రజాజ్యోతి)

పీఎంశ్రీ జెడ్పిహెచ్‌ఎస్ కున్సిలో నిర్వహించిన ఎక్స్‌ట్ టాక్ ప్రోగ్రాం లో భాగంగా ప్రముఖ సైకాలజిస్ట్, బి.ఎడ్. కళాశాల రిటైర్డ్ లెక్చరర్ రాధాకృష్ణారావు విద్యార్థులకు విలువైన మార్గదర్శనం చేశారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత, పరీక్షల





సమయంలో ఒత్తిడిని అధిగమించే మార్గాలు, సమయపాలన, లక్ష్యసాధన వంటి అంశాలపై చక్కని అవగాహన కల్పించారు.ప్రముఖ వ్యక్తుల జీవితాల్లోని ఆసక్తికర సంఘటనలను ఉదాహరణలుగా వివరిస్తూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, పట్టుదలను, సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందించారు.మన జీవితాలను మార్చే శక్తి చదువుకు మాత్రమే ఉంది. ప్రపంచంలో అత్యంత విలువైన సంపద సమయం. ఒక్కసారి చేజారిన సమయం తిరిగి రాదు. కాబట్టి ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యం వైపు అడుగులు వేయాలి" అని విద్యార్థులకు ఉద్బోధించారు.ఆయన ప్రసంగం విద్యార్థుల్లో కొత్త ఆలోచనలకు, కొత్త ఆశలకు, ఉన్నత లక్ష్యాల సాధనకు స్ఫూర్తినిచ్చింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి బి. సంతోషి, ఉపాధ్యాయ బృందం పి. నరేందర్, ఉష, ఖాసీం అలీ, సౌమ్య, నర్సిములు, సత్యనారాయణ రెడ్డి, స్వాతి, గీత, ఆరీఫ్, రాధిక, స్మిత, నగేష్, కృష్ణవేణి, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

మహమ్మదాబాద్ నవంబర్ 5(ప్రజా జ్యోతి)

ముందలి తాండా లో జల మహోత్సవం కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి అంజ్యా నాయక్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ తాండవాసులను ఉద్దేశించిఅంజ్యా నాయక్ మాట్లాడుతూ నీటిని వృధా చేయకుండా ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు రాబోయే రోజుల్లో తండాలోని నీటి ఎద్దడి, కొరత రాకుండా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో =ఔా దీప్తి గ్రామ కార్యదర్శి వాటర్ మన వెంకట్ వార్డు సభ్యులు యువకులు తదితరులు పాల్గొన్నారు.



కరువు కష్టాల్లో రైతులకు బ్యాంకర్లు అండగా నిలవాలి.!

- పంట రుణాల పునర్వ్యవస్థీకరణతో ఆర్థిక ఉపశమనం.. అర్హులైన ప్రతి రైతుకు కొత్త రుణాలు అందించాలి
- తీవ్ర కరువు మండలాల్లో 60 నెలలు.. మధ్యస్థ కరువు మండలాల్లో 36 నెలల వరకు రుణ చెల్లింపు గడువు పొడిగింపు

మహబూబ్‌నగర్, నవంబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో):

ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు బ్యాంకర్లు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. కరువు కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పంట రుణాల పునర్వ్యవస్థీకరణ ద్వారా ఉపశమనం కల్పించాలని, అర్హులైన ప్రతి రైతుకు నిబంధనల ప్రకారం రుణ సదుపాయాలు అందించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ, జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులకు బ్యాంకుల ద్వారా అందించాల్సిన సహాయక చర్యలు, పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాల మంజూరు తదితర అంశాలపై సమీక్షించారు.

తీవ్ర కరువు మండలాలకు 60 నెలల గడువు..

జిల్లాలో చిన్నచింతకుంట, కోయిలకొండ మండలాలను తీవ్ర కరువు మండలాలుగా, గండీడ్, హన్వాడ, మహబూబ్‌నగర్ రూరల్, దేవరకద్ర, అడ్డాకుల, మూసాపేట, మహబూబ్‌నగర్ అర్బన్, బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, కౌకుంట్ల మండలాలను మధ్యస్థ కరువు మండలాలుగా ప్రభుత్వం గుర్తించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ, ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం కరువు ప్రభావిత ప్రాంతాల్లోని అర్హులైన రైతులకు పంట రుణాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని సూచించారు. తీవ్ర కరువు ప్రభావిత మండలాల్లోని రైతులకు 12 నెలల మారటోరియంతో కలిపి మొత్తం 60 నెలల



వరకు, మధ్యస్థ కరువు మండలాల్లోని రైతులకు 12 నెలల మారటోరియంతో కలిపి మొత్తం 36 నెలల వరకు రుణ చెల్లింపు కాలపరిమితిని పొడిగించే వెసులుబాటు ఉందని వివరించారు.

రుణాల వసూళ్ల పేరుతో రైతులపై ఒత్తిడి వద్దు.!

కరువు పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి సమయంలో రుణాల చెల్లింపుల కోసం వారిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావద్దని కలెక్టర్ బ్యాంకు అధికారులకు స్పష్టం చేశారు. రైతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అర్హులైన రైతులందరికీ రుణ ప్రయోజనాలు అందేలా బ్యాంకులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.

రైతు వేదికలు, గ్రామసభల ద్వారా అవగాహన కల్పించాలి

రైతులకు అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు, పంట రుణాల పునర్వ్యవస్థీకరణపై మండలాల వారీగా కార్యాచరణ ప్రణాళిక



రూపొందించాలని కలెక్టర్ సూచించారు. రైతు వేదికలు, గ్రామసభల ద్వారా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో బ్యాంకులు అందిస్తున్న సేవలు, రుణ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయంతో పాటు ఉద్యానవన, మత్స్య, పశు సంవర్ధక రంగాలను ప్రోత్సహించేందుకు అర్హులైన రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఆయా శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న రుణ పథకాలు అర్హులకు చేరేలా బ్యాంకు సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. కరువు ప్రభావిత రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంలో బ్యాంకులు, వ్యవసాయ శాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, ఎల్‌డీఎం చంద్రశేఖర్, నాబార్డ్ ఏజీఎం షణ్ముఖ చారి, వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

"కొత్తపల్లిలో సర్పంచ్, కార్యదర్శి ఏకపక్షం.. ఎంపీడీఓ కు ఫిర్యాదు"



ఊట్కూర్, నవంబర్ 05(ప్రజాజ్యోతి):

నారాయణట జిల్లా ఊట్కూర్ మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ పాలన అస్తవ్యస్తంగా తయారైందని, సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి ఏకపక్షంగా,వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఉప సర్పంచ్ మమత మండల ఎంపీడీఓ మేడమ్ కు వినతిపత్రం సమర్పించారు. గురువారం ఆమె సమర్పించిన వినతిపత్రంలో తెలిపిన వివరాల ప్రకారం, గ్రామ పంచాయతీకి సంబంధించిన ఏ అంశాన్ని కూడా ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు తెలియజేయడం లేదని, పంచాయతీ బాడీ సమావేశం నిర్వహించకుండానే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తమ సన్నిహితులతో కలిసి ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) పనులు, రామ్స్ పనులు, పనులకు సంబంధించిన సీనియర్ మెట్ల నియామకం విషయంలో పంచాయతీ తీర్మానం లేకుండా, ఎవరి అనుమతి లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ నిబంధనలను తుంగలో తొక్కుతూ వ్యవహరిస్తుండటంతో అభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా గత ఏడాది కాలంగా ఈజీఎస్, రామ్స్ పనులకు, సీనియర్ మెట్లకు సంబంధించిన బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని, దీంతో పనులు చేసిన కూలీలు, మెట్లు చెల్లింపులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు సర్పంచ్, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని వాపోయారు. కావున ఈ వ్యవహారంపై వెంటనే విచారణ జరిపి, నిబంధనల ప్రకారం పంచాయతీ పాలన సాగేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక దృష్టి

- పోలీస్ లైన్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ, ఎంఈఓ

- పిల్లలను ప్రతిరోజూ బడికి పంపించాలి..

తల్లిదండ్రులు కూడా విద్యార్థుల ప్రగతిని పరిశీలించాలి: డీఈఓ

మహబూబ్‌నగర్, నవంబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో):



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా డీఈఓ, ఎంఈఓలు పోలీస్ లైన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (గవర్నమెంట్ పీఎస్), ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రెండు పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సమావేశాల్లో పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని కోరారు. తల్లిదండ్రులు కూడా అప్పుడప్పుడు పాఠశాలను సందర్శించి పిల్లల విద్యా ప్రగతిని తెలుసుకోవడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించాలని సూచించారు.



విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలు తప్పనిసరి!

ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం వంటి ప్రాథమిక గణిత ప్రక్రియలతో పాటు తెలుగు, ఇంగ్లీషు చదవడం తప్పనిసరిగా రావాలని డీఈఓ సూచించారు. పాఠశాలలో నేర్చుకున్న పాఠాలను ఇంటి వద్ద కూడా పునశ్చరణ చేసుకునేలా తల్లిదండ్రులు ప్రతిరోజూ సాయంత్రం ఒకటి నుంచి రెండు గంటల సమయం కేటాయించి పిల్లలను చదివించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు.. సద్వినియోగం చేసుకోవాలి!

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, షూస్, బెల్టులు, టైలు, సాక్సులు, రెండు జతల యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు వంటి అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని వివరించారు. ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించి ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజనంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత

అనంతరం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అధికారులు పరిశీలించారు. వంటశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంటకు ఉపయోగించే నూనెలు, ఇతర ఆహార పదార్థాలు, వంట సామగ్రిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని వంట సిబ్బందికి సూచించారు. వంట చేసేవారు కూడా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల డిప్యూటేషన్లు రద్దు

- రెండోవ విడత వర్క్ -

- అడ్జస్ట్మెంట్ ద్వారా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతకు పరిష్కారం

- డిఇఓ రమేష్ కుమార్

నాగర్ కర్నూల్ నవంబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో)



పెద్దకొత్తపల్లి, కోడేరు మండలాల నుంచి ఇతర మండలాల్లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల డిప్యూటేషన్లను రద్దు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఏ. రమేష్ కుమార్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ. మండలాల్లో పాఠశాలల వారీగా ఉపాధ్యాయుల అవసరాలను గుర్తించి, విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పెద్దకొత్తపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లోఉపాధ్యాయుల కొరతను గుర్తించి, ఆయా పాఠశాలలకు అవసరమైన ఉపాధ్యాయులను రెండో విడత వర్క్ అడ్జస్ట్మెంట్ ప్రక్రియ ద్వారా కేటాయించినట్లు తెలిపారు.పాఠశాలల్లో ఉపాధ్యాయుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, అందుబాటులో ఉన్న ఉపాధ్యాయులను సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా ఈ చర్యలు చేపట్టినట్లు డీఈఓ తెలిపారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ద్వారా పాఠశాలల్లో బోధనకు సంబంధించిన అవసరాలను తీర్చేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.పెద్దకొత్తపల్లి, కోడేరు మండలాల నుంచి ఇతర మండలాలకు డిప్యూటేషన్‌పై వెళ్లిన ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల డిప్యూటేషన్లు రద్దు చేయడంతో పాటు, పెద్దకొత్తపల్లి మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల అవసరాలను రెండో విడత వర్క్ అడ్జస్ట్మెంట్ ద్వారా భర్తీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ స్పష్టం చేశారు.

వలలో చిక్కిన జింకను ప్రాణాపాయం నుంచి కాపాడిన రైతులు, పోలీసులు







చిన్నంబావి, నవంబర్ 05 (ప్రజాజ్యోతి)

పంట రక్షణ కోసం వేసిన వలలో చిక్కుకుని తీవ్ర ప్రాణాపాయ స్థితిలో విలవిల్లాడుతున్న జింకను స్థానిక రైతులు, పోలీసుల సమన్వయంతో సురక్షితంగా బయటకు తీశారు. ఆపదలో ఉన్న మూగజీవి పట్ల రైతులు చూపిన మానవతా వైఖరి, పోలీసుల తక్షణ స్పందన గ్రామస్తుల ప్రశంసలకు కారణమయ్యాయి.చిన్నంబావి మండల కేంద్రానికి సమీపంలోని పెద్దమారూర్ గ్రామ పరిధిలో, ఏటి పరివాహక ప్రాంతంలోని నీటి మునక పంట పొలాల్లో అడవి పందులు, పశువుల నుంచి పంటలను కాపాడేందుకు రైతులు వలలు ఏర్పాటు చేశారు. ఆ వలలో ఒక జింక చిక్కుకుంది.జింక కొమ్ములకు వల మెడ చుట్టూ పెట్టుకోవడంతో జింక కదలలేక తీవ్ర వేదనలో పడింది. ఈ పరిస్థితిలో రైతు కృష్ణ పొలంలో జింకను గమనించిన స్థానిక రైతులు వెంటనే డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసుల తక్షణ స్పందన సమాచారం అందుకున్న చిన్నంబావి స్థానిక పోలీసులు దిలీప్ కుమార్, గౌస్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. రైతుల సహకారంతో జింకను అత్యంత జాగ్రత్తగా విడిపించారు. దాదాపు 30 నిమిషాల పాటు శ్రమించి, జింకకు ఎలాంటి గాయాలు కలగకుండా వల నుంచి సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం జింక ప్రాణాపాయం నుంచి బయటపడి అడవి వైపు కదిలిపోయింది.

రైతుల చొరవకు ప్రశంసలు

ఒకవేళ రైతులు సకాలంలో గమనించకపోతే జింక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉండేదని గ్రామస్తులు అంటున్నారు. పంట రక్షణ కోసం వేసిన వలల్లో చిక్కిన వన్యప్రాణిని కాపాడేందుకు రైతులు చూపిన చొరవ, పోలీసుల వేగవంతమైన స్పందనపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రకృతికి,వన్యప్రాణులకు ఉన్న బాధ్యతను ఆచరణలో నిలిపిన ఈ ఘటన ప్రశంసనీయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటన మానవులు, వన్యప్రాణుల మధ్య సహజీవన భావనకు నిదర్శనమని పలువురు పేర్కొంటున్నారు.చిన్నంబావి పరిసర ప్రాంతాల్లోని కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో జింకలు, అడవిపందులు తదితర వన్యప్రాణుల సంచారం ఎక్కువగా ఉంటుంది. పంటల రక్షణ కోసం ఏర్పాటు చేసే సోలార్ విద్యుత్ వంటి వలలు, ఇతర అడ్డంకుల్లో వన్యప్రాణులు చిక్కుకుని ప్రాణాపాయానికి గురయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు పంట రక్షణ చర్యలు చేపట్టే సమయంలో వన్యప్రాణులకు హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. ప్రమాదవశాత్తు వలల్లో చిక్కుకున్న వన్యప్రాణులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. రైతుల మానవత్వం, పోలీసుల చొరవతో జింక ప్రాణాలు నిలిచిన ఈ ఘటన వన్యప్రాణుల సంరక్షణకు మానవీయత ఎంత అవసరమో చాటిచెప్పింది.

మోగ్ధంపూర్ గ్రామంలో సొంతవేతనంతో వాలంటీర్ టీచర్ గ్రామ సర్పంచ్ కు ప్రశంశాలు



ఉట్కూరు నవంబర్ 05 (ప్రజాజ్యోతి)

ఉట్కూర్ మండల మోగ్ధంపూర్ గ్రామంలో ఎంపియుపిఎస్ పాఠశాలల్లో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని గ్రామ సర్పంచ్ తిరుమలేష్ కు వివరించిగా వెంటనే స్పందించిన గ్రామ సర్పంచ్ తిరుమలేష్, ఉప సర్పంచ్ నరేందర్ గౌడ్, తమ సొంత వేతనం నుండి ఖర్చు భరించి ఒక వాలంటీర్ ఉపాధ్యాయుని ఏర్పాటు చేయడానికి సర్పంచ్ ఉప సర్పంచ్ ముందుకు వచ్చారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విరళముగా 3000 రూపాయలు, అందించారు. జంజర్ల అశోక్,1500, రూపాయలు, గుండప్ప, పద్మమ్మ,సుమలత,500 చొప్పున విరలంగా ఇచ్చారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

- రూ.9,053 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. పూర్తయిన ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు

- మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభం.. 50 వేల మంది రైతులతో భారీ బహిరంగ సభ

మహబూబ్ నగర్, నవంబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో):

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నవంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించ నున్నారు. ఈ పర్యటనలో భాగంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి వేల కోట్ల రూపాయల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించడంతో పాటు రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో ప్రత్యేక సమావేశాల్లో పాల్గొననున్నారు.

మూడు రోజుల పర్యటనలో మొత్తం రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనుండగా, రూ.46.08 కోట్లతో నిర్మాణం పూర్తయిన పది ప్రభుత్వ భవనాలను ప్రారంభించనున్నారు.

నవంబర్ 7: రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభం

శనివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11 గంటలకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటకు చేరుకుంటారు. ఉదయం 11.10 గంటలకు మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించి ప్రదర్శన స్టాల్లను సందర్శిస్తారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి సమావేశంలో పాల్గొంటారు. అనంతరం పారిశ్రామికవేత్తలతో సమావేశమై పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు రోడ్డు మార్గంలో కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.

నవంబర్ 8: అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. భవనాల ప్రారంభోత్సవాలు

ఆదివారం ఉదయం 9.15 గంటలకు కొడంగల్ నివాసం నుంచి బయలుదేరి హకీంపేటకు చేరుకుంటారు. 9.30 నుంచి 10.20 గంటల వరకు స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. అనంతరం వరుసగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.- ఉదయం 10.30 గంటలకు లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన.- ఉదయం 10.45 గంటలకు హకీంపేటలో రూ.4 కోట్లతో నిర్మించిన జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల ప్రారంభం.- ఉదయం 11 గంటలకు రూ.2.35 కోట్లతో నిర్మించిన హకీంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం.- ఉదయం 11.30 గంటలకు బొంరాస్‌పేటలో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభం.- ఉదయం 11.45 గంటలకు రూ.3 కోట్లతో నిర్మించిన బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్ ప్రారంభం.- మధ్యాహ్నం 12.15 గంటలకు కొడంగల్‌లో రూ.3.80 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయం ప్రారంభం.- మధ్యాహ్నం 12.45 గంటలకు దుద్యాలలో రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్ ప్రారంభం.- మధ్యాహ్నం 1.15 గంటలకు రూ.12 కోట్లతో నిర్మించిన సమీకృత మండల కార్యాలయ భవనం ప్రారంభం.- మధ్యాహ్నం 1.40 గంటలకు కోస్గి మండలం నాచారంలో రూ.5,060 కోట్లతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు--2కు శంకుస్థాపన.- మధ్యాహ్నం 2 గంటలకు కోస్గిలో రూ.6 కోట్లతో నిర్మించిన సైన్స్ మ్యూజియం ప్రారంభం.- మధ్యాహ్నం 2.45 గంటలకు దౌల్తాబాద్ మండలం బాలంపేటలో రూ.2.35 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం.- మధ్యాహ్నం 3.30 గంటలకు దౌల్తాబాద్‌లో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభం.అనంతరం ముఖ్యమంత్రి కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేయనున్నారు.

రూ.9,053 కోట్లతో 13 అభివృద్ధి పనులు

ఈ పర్యటనలో భాగంగా చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రధానంగా రవాణా, సాగునీరు, విద్య, ఉపాధి, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యత కల్పించారు.- రూ.5,060 కోట్లతో కొత్తవాల్‌గూడ నుంచి నాచారం వరకు రేడియల్ రోడ్డు--2 నిర్మాణం.- రూ.1,410 కోట్లతో 223 కొత్త, అసంపూర్తి బీటీ రహదారుల పనులు.- రూ.2,100 కోట్లతో ఎంఎన్‌కేఎల్ఐఎస్ రెండో దశ పనులు.- రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు.- రూ.123 కోట్లతో కొడంగల్‌లో వ్యవసాయ కళాశాల నిర్మాణం.- రూ.41.83 కోట్లతో కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్ స్టాండ్ల నిర్మాణం.- రూ.20 కోట్లతో మద్దూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్.- రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం.- రూ.59.30 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు.- తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరం అభివృద్ధికి రూ.4.45 కోట్లు.- కొడంగల్‌లో నిరంజన్ మఠం అభివృద్ధికి రూ.5.10 కోట్లు.- హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.10 కోట్లతో పర్యాటక హోటల్ నిర్మాణం.- రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు.రూ.46.08 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రారంభం పర్యటనలో భాగంగా మొత్తం రూ.46.08 కోట్లతో నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. వీటిలో పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సమీకృత మండల కార్యాలయ భవనం, సైన్స్ మ్యూజియం ఉన్నాయి.

నవంబర్ 9: 50 వేల మంది రైతులతో భారీ బహిరంగ సభ

సోమవారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి కొడంగల్ నివాసం నుంచి హకీంపేటకు బయలుదేరుతారు. అక్కడ సాయంత్రం నిర్వహించే భారీ రైతు బహిరంగ సభలో పాల్గొని రాత్రి 7 గంటల వరకు ప్రసంగించనున్నారు.ఈ సభకు రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులను సమీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.మొత్తంగా మూడు రోజుల ముఖ్యమంత్రి పర్యటనలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు, రైతులు, పారిశ్రామికవేత్తలు, మహిళా సంఘాలతో సమావేశాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టనున్న ఈ కార్యక్రమాల అమలు, వాటి ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తులు తహసీల్దార్‌కు అందజేత

కృష్ణా నవంబర్05(ప్రజాజ్యోతి)

కృష్ణ మండలం: భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) కృష్ణ మండలం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా అర్హులైన పట్టభద్రుల నుంచి సేకరించిన ఎన్రోల్మెంట్ దరఖాస్తు ఫారాలను గురువారం కృష్ణ మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు అందజేశారు.ఈ సందర్భంగా కృష్ణ మండల బీజేవైఎం అధ్యక్షులు వొట్టేపోళ్ల సురేష్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అర్హులైన పట్టభద్రులందరికీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా తమ వంతు కృషి కొనసాగిస్తామని సురేష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హిందూపూర్ గౌరీ శంకర్, మురహర్ దొడ్డి జిందప్ప,తదితరులు పాల్గొన్నారు.

